క్లుప్తంగా

నేడు పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లుమున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

వీఆర్వోలతో సమీక్ష

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. జుజ్జూరులోని రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమదృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

అమ్మవారి అలంకరణకు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో ఒకరోజు పూలదండల అలంకరణకు పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన భవిరిశెట్టి సైదులు, పవిత్ర దంపతులు రూ.10,001 విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పరిశ్రమలపై విద్యార్థులకు అవగాహన



నందిగామటౌన్: విద్యార్థులకు చదువుతో పాటు ఆటోమొబైల్స్ తదితర రంగాలపై అవగాహన కల్పిస్తున్నట్లు స్థానిక జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అరుణకిషోర్ తెలిపారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పట్టణంలోని తనిష్ మోటార్స్, శ్రీమిత్రా మోటార్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అరుణకిషోర్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ఆయా రంగాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహద పడుతుందన్నారు. అన్నిరంగాలపై అవగాహన ఉంటే ఆసక్తి ఉన్న రంగంపై దృష్టిపెట్టి నైపుణ్యం సాధించేందుకు వీలు కలుగుతుందన్నారు. అనంతరం మోటార్స్‌లోని సిబ్బంది విద్యార్థులకు ట్రాక్టర్ పనితీరు. ఇంజన్ సామర్థ్యం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ సైదావలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 13న గ్రాండ్ సెమీక్రిస్మస్ వేడుకలు



కంచికచర్ల: నందిగామ నియోజకవర్గ పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 13వ తేదీ సాయంత్రం 6గంటలకు గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ మార్కపూడి డేవిడ్ తెలిపారు. నందిగామ గిల్గాల్ ప్రేయర్ చర్చిలో ఈ మేరకు శుక్రవారం గోడపత్రికను ఆవిష్కరించారు. పాస్టర్ మాట్లాడుతూ ఈగ్రాండ్ సెమీక్రిస్మస్ వేడుకలకు ప్రసంగీకులుగా విజయవాడకు చెందిన డాక్టర్ హేమిల్టన్ వి టల్లి ప్రసంగిస్తారన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, స్వర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జీ అవినాస్ హాజరవుతారన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎం జాన్, కే జయరాజు, ఎం యోహాన్, ఏ సీమోను తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 3.70 లక్షలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీని శుక్రవారం లెక్కించారు. గడచిన మూడు నెలలకుగాను రూ.3,70,210 ఆదాయం వచ్చినట్లు మేనేజర్ వీడీడీ ప్రసాద్ తెలిపారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ కేవీ అనురాధ పర్యవేక్షణలో సిబ్బంది, గంపలగూడెంకు చెందిన మహిళలు పాల్గొన్నారు.



నిబంధనలకు తూట్లు

- నామినేషన్ పద్ధతికి జై అంటున్న పాలకులు
- ఇష్టమైనవారికి పనుల అప్పగింత
- నామినేషన్ పద్ధతిలో ఐదునెలల్లో రూ.1.70 కోట్ల పనులు
- వెల్లువెత్తుతున్న విమర్శలు
- చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు

జగ్గయ్యపేటఅర్బన్: వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చున్నా సుష్టిగా వడ్డిస్తారు అన్న చందంగా తయారైంది జగ్గయ్యపేట పురపాలక సంఘంలో కాంట్రాక్టు పనుల కేటాయింపు పరిస్థితి. తమకు నచ్చిన వారికి దోచిపెట్టేందుకు మున్సిపల్ పాలకులు నిబంధనలను యథేచ్ఛగా కాలరాస్తున్నారు. టెండర్లు పిలిచి ఇవ్వాల్సిన కాంట్రాక్టు పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. దీంతో పట్టణంలోని అన్ని వార్డులకు సమంగా అందాల్సిన జనరల్ ఫండ్స్ దుర్వినియోగమవుతున్నాయనే విమర్శలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తున్నా పాలకులు వినీవిననట్లు దులుపుకుపోతుండటం గమనార్హం.

అస్తవ్యస్తంగా పురపాలన..

జగ్గయ్యపేట పురపాలక సంఘంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. తనకు ఎక్కడ పదవీగండం ఉంటుందోనన్న భయాందోళనతో పదవిని నిలుపుకునేందుకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర టీడీపీలో చేరారు. అదేవిధంగా మున్సిపల్ పాలనను గాలికొదిలేసి అడపాదడపా టీడీపీ కార్యక్రమాల్లో మాత్రమే కనిపిస్తూ మిగిలిన సమయం అంతా హైదరాబాద్‌లోనే గడుపుతున్నారు. దీంతో

మున్సిపాలిటీలో టెండర్లు లేకుండా పనులు

మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు మున్సిపల్‌పాలనపై పట్టుతప్పింది. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ పదవి చేజారకుండా ఉండేందుకుగాను అధికార కూటమి పార్టీ కనుసన్నల్లో నడుస్తూ ఆపార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారనే విమర్శలు రాజకీయవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈక్రమంలో చైర్మన్‌గా తనకు ఉన్న అధికారంతో టీడీపీ నాయకులకు కొమ్ముకాస్తూ వారికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగానే టెండర్ల పద్ధతిలో ఇవ్వాల్సిన మున్సిపల్ కాంట్రాక్టు పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని గమనించిన మున్సిపల్ అధికారులు సైతం ఇష్టారీతిన వ్యవహరిస్తూ తమపబ్బం గడుపుకుంటున్నారు.

పనులు విభజించు..కేటాయించు..

నిబంధనల ప్రకారం రూ.5లక్షలలోపు పనులను మాత్రమే నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు కేటాయించాలి. ముఖ్యంగా తాగునీటి సరఫరా వంటి పనులను అత్యవసర సమయాల్లో, టెండర్లు పిలిచేందుకు కూడా సమయం లేనపుడు మాత్రమే నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అంతకుమించిన విలువగల పనులకు తప్పకుండా టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే మున్సిపల్ పాలకులు, అధికారులు తెలివిగా వ్యవహరిస్తూ రూ.20లక్షల విలువగల పనులను రూ.5లక్షల విలువగల నాలుగు పనులుగా విభజించి తమకు నచ్చినవారికి కేటాయిస్తున్నారు. అయితే ఆ విభజించిన పనులను కూడా ఒక్కో పనిని ఒక్కో కాంట్రాక్టర్‌కు కాకుండా ఒకే కాంట్రాక్టర్‌కు మూడు, నాలుగు పనులు కేటాయిస్తూ నిబంధనలను తూట్లు పొడుస్తున్నారు. ముక్త్యాల రోడ్‌లో కంపోస్టు యార్డు వద్ద చేపట్టిన పైపులైన్, గ్రావెల్ నింపే పనుల విలువ రూ.39.04లక్షలు కాగా, ఈ పనిని రూ.5లక్షలలోపు ఉండేలా మొత్తం 8పనులుగా విభజించి కాంట్రాక్టర్ గట్టిడి దుర్గాప్రసాద్ ఒక్కరికే అప్పగించడం గమనార్హం. ఇలా గత ఐదునెలలుగా ఈ తుంతు జగ్గయ్యపేట మున్సిపాలిటీలో యథేచ్ఛగా సాగుతోంది.

రూ.1.70 కోట్ల పనులు కేటాయింపు

ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.1.70కోట్ల పనులు ఇలా నామినేషన్ పద్ధతిలో సాగాయి. జూన్ నెలలో రూ.49.89లక్షలు విలువగల పనులను నామినేషన్ పద్ధతిలో ఇవ్వగా, జూలైలో రూ.4.98లక్షలు, ఆగస్టులో రూ.22.90లక్షలు, సెప్టెంబర్‌లో రూ.39.04 లక్షలు, అక్టోబర్‌లో రూ.49.50లక్షలు విలువగల పనులు నామినేషన్ పద్ధతిలో కేటాయించగా ఇందులో జూలైలో నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన రూ.4.80లక్షల విలువగల పనులు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా ఇచ్చినవి కావడం గమనార్హం. ఇలా నామినేషన్ పద్ధతిలో తమకు నచ్చినవారికి, అనుయాయులకు పనులను కేటాయిస్తూ మున్సిపల్ చైర్మన్, అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి నామినేషన్ పద్ధతిలో సాగుతున్న ప్రజాధనం దోపిడీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారు



జనరల్ ఫండ్ రూపంలో ఏటా మున్సిపాలిటీకి రూ.4కోట్ల వరకు ఆదాయం వస్తుంది. దీనిని పాలకవర్గం నామినేషన్ వర్క్‌ల రూపంలో తమకు నచ్చిన కంట్రాక్టర్లకు కేటాయిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తద్వారా అన్నివార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. వరదల సమయంలో రూ.10కోట్ల నుంచి రూ.12 కోట్లు వరకు ఖర్చుచేశారు. ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం నుంచి వరద సహాయం నిధులు రాబట్టలేకపోతుండటం కూడా పట్టణాభివృద్ధికి మైనస్‌గా మారింది.

..వట్టెం మనోహర్, 5వ వార్డు కౌన్సిలర్

వరదల పేరుతో దోచిపెట్టారు



వరదలు, డయేరియా సమయంలో సున్నం, బ్లీచింగ్, పారిశుద్ధ్యం పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువగల పనులను నామినేషన్ పద్ధతిలో తమకు అనుకూలమైన కంట్రాక్టర్లకు కేటాయిస్తుండటం శోచనీయం. ఆయా పని విలువ రూ.5లక్షల కంటే అధికంగా ఉంటే టెండర్లు పిలవాలి. కాని రూ.20లక్షల నుంచి రూ.40లక్షల పనులను కూడా ముక్కలు ముక్కలుగా చేసి నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తూ ఇష్టారీతిన పనులు అప్పగించడం తగదు. ఇలా ప్రజాధనాన్ని నచ్చినవారికి దోచిపెడుతున్నారు. ఈ విషయంపై విజిలెన్స్ వారికి ఫిర్యాదు చేసి విచారణ చేయిస్తాం.

.. షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

నిబంధనల ప్రకారమే చేశాం..



అత్యవసర సమయాల్లో చేయాల్సిన నామినేషన్ వర్క్‌లు నిబంధనల ప్రకారమే కంట్రాక్టర్లకు కేటాయించడం జరిగింది. ఇందులో ఎటువంటి వివక్షతకు తావులేదు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదు.

ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

రేపు వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్డులో యోగిరామ్ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజవర్గ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించనున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అనంతరం పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తోపాటు ముఖ్య అతిథులుగా పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్లు వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి, కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గానికి ఇప్పటివరకు 215 మందికి సుమారు రూ.1.85కోట్లను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన బాధితులు అనారోగ్య కారణాలతో వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన ఆర్థికసాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం 115 మంది దరఖాస్తు చేసుకోగా వారికి రూ.85 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : ఆర్డీఓ



అనుమంచిపల్లిలో ధాన్యం కల్లం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): రైతులు ధాన్యం విక్రయించే విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ సూచించారు. అధికారులతో కలిసి శుక్రవారం ఆయన అనుమంచిపల్లి గ్రామంలోని ధాన్యం కల్లాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. . ముఖ్యంగా కనీస మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధర పొందాలన్నారు. అంతే కాకుండా ధాన్యం విక్రయించిన 48గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతోందని చెప్పారు. ఇప్పటి వరకు మండలంలో 400 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతరం సమీపంలోని రైసుమిల్లును ఆర్డీఓ సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ భవానీ, తహసీల్దార్ మనోహర్, సివిల్ సప్లై డీటీ స్వప్న, ఏవో వరలక్ష్మి, వీఆర్వో బాబురావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు తోడ్పాటునందిస్తున్నాం: ఎమ్మెల్యే



స్వయంశక్తి సంఘ సభ్యులతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: దివ్యాంగులకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు రూపొందించి వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక ఉక్కు కళావేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి స్వయంశక్తి దివ్యాంగుల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులంతా కలిసి స్వయంశక్తి పేరుతో సంక్షేమ అభివృద్ధి సంఘాన్ని స్థాపించుకుని వారి సమస్యల పరిష్కారానికి పనిచేస్తుండటం శుభపరిణామమన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ అందిస్తోందని, మంచాన పడిన వారికి రూ.15వేల పింఛన్ అందిస్తున్నట్లు వివరించారు.స్వయంశక్తి సంఘానికి భవనవసతి కల్పిస్తామని, ఇతరత్రా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు సానుభూతి కోరకుండా ఆత్మ విశ్వాసంతో ముందుకుసాగాలన్నారు. తమ హక్కుల సాధనకు సమైక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈసందర్భంగా తిరుపతి నుంచి వచ్చిన శ్రీపద్మావతి ఫౌండేషన్ డైరెక్టర్లను అభినందించారు. వారి స్ఫూర్తితో జగ్గయ్యపేటలో కూడా సహకార సంఘాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్వయంశక్తి సంఘం ప్రమోటర్ కరణం లుగేంద్రపిళ్లై మాట్లాడుతూ దివ్యాంగులు గ్రామసంఘాలు, మండల స్థాయిలో సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పొందే ఉపయోగాలను వివరించారు. స్వయంశక్తి సంఘం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమకు కార్యాలయ భవన సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే తాతయ్యను కోరారు. పారిశ్రామిక సంస్థలు కూడా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కట్టా నరసింహారావు, సామాజికవేత్త కర్లపాటి శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధి మహేష్, స్వయంశక్తి సంఘం ప్రధాన కార్యదర్శి గోనె విజయలక్ష్మి, గాయత్రి మహిళా యోగ సంఘం ప్రెసిడెంట్ లీలావతి, తిరుపతి పద్మావతి ఫౌండేషన్ కోఆపరేటివ్ చైర్‌పర్సన్ ఉప్పలపాటి శంకరి, సరోజమ్మ, మోహన్ పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలని టీచర్ల డిమాండ్



పెండ్యాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

కంచికచర్ల: ఉపాధ్యాయుల వ్యక్తిగత సెలవుల మంజూరులో విధించిన ఆంక్షలను ప్రభుత్వం సడలించాలని పీఆర్టీయూ పత్రిక ప్రధానసంపాదకులు గడ్డం నారాయణరావు డిమాండ్ చేశారు. మండలంలోని పెండ్యాల, కీసర, గండేపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల యూనిట్‌గా 10శాతం మించి సెలవులు మంజూరు చేయరాదనే నిబంధన తెచ్చేందుకు రాష్ట్రస్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని ఇది సరైన విధానం కాదన్నారు. సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, కోసూరి రాజశేఖర్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రభుత్వం వివిధరకాలైన యాప్‌ల భారం మోపి ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు, ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ తదితర బకాయిలను వెంటనే ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిటీ నియమించేంత వరకు తక్షణమే 30శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు వేముల క్రిష్టాఫర్, ప్రధాన కార్యదర్శి దబ్బూరి సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల రమేష్, సీనియర్ నాయకులు ఏఎస్ఎన్.మూర్తి, డి.మల్లికార్జునరావు హనుమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఇన్‌చార్జి చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి



నందిగామటౌన్: నందిగామ పట్టణంలోని 20వార్డుల పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి తెలిపారు. పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ ఆయా వార్డుల్లోని చేతి పంపుల మరమ్మతులకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. తాగునీరు సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ అజెండాలోని 18 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, షేక్ ఖాలిక్, షేక్ యాకుబ్ అలీ, బండారు గంగమ్మ, మందా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో ఏసీపీ పర్యటన

పెనుగ్రంచిపోలు: డిసెంబరులో నిర్వహించనున్న సాగు నీటి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా రైతులు సహకరించాలని నందిగామ ఏసీపీ తిలక్ కోరారు. మండలంలోని నవాబుపేట సమస్యాత్మక గ్రామంగా ఉన్నందున శుక్రవారం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డిసెంబరులో జరిగే సాగునీటి ఎన్నికలకు ఎటువంటి ఘర్షణలు, అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరిగేలా నవాబుపేటవాసులు సహకరించాలని కోరారు. వివాదాలు, అల్లర్లకు పాల్పడేవారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఏసీపీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



నందిగామ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో జ్యోతిర్లింగ దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

నందిగామటౌన్: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని నందిగామలోని శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి ఆలయ ఆవరణలో జ్యోతిర్లింగ దీపోత్సవాన్ని మహిళలు కన్నుల పండువగా నిర్వహించి దీపలక్ష్మికి పూజలు చేశారు. ఈవో గంగాధర్, అనువంశిక ధర్మకర్త మురళీ రాఘకుమార్ పర్యవేక్షణలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇళ్లస్థలాలు చూపించాలంటూ ఆందోళన



పరిటాల గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

కంచికచర్ల: తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అధికారులు చూపించాలని డిమాండ్‌చేస్తూ పరిటాల గ్రామ సచివాలయం వద్ద మహిళలు శుక్రవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమంతా అద్దె ఇళ్లలో ఉంటుండగా, గత ప్రభుత్వంలో 470మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేస్తూ అధికారులు పట్టాలు కూడా అందజేశారన్నారు. కాని గ్రామానికి చెందిన కొందరు నాయకులు ఇళ్లస్థలాలకు కేటాయించిన భూమిపై కోర్టుకు వెళ్లడంతో పెండింగ్‌లో పడిందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి భూమి పెండింగ్ సమస్యను పరిష్కరించి తమకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. అనంతరం పరిటాల వీఆర్వో గౌస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సవరణ

14-11-2024 తేదీన సాక్షి దినపత్రిక నందిగామ ... Shriram Finance Ltd. ...

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: సౌమ్య

నందిగామటౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నూతన సంస్కరణలకు నాంది పలుకుతున్నారన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా రాణిస్తున్నారని వివరించారు. పారిశ్రామికరంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ సెక్టార్‌లో సైతం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని వివరించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, కళాశాల అధ్యాపకులు నిరుద్యోగ యువతీయువకులు పాల్గొన్నారు.